సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



అధినేత జగన్‌తో మాట్లాడుతున్న రాజీవ్‌గాంధీ

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ మర్యాదపూర్వకంగా కలిశారు. కాసేపు రాజకీయ విశేషాలపై చర్చించారు.

రోగులకు పండ్లు, భోజనాల పంపిణీ



కుష్టువ్యాధి కేంద్రంలో రోగులకు భోజనాలు పంపిణీ చేస్తున్న ఇలియాస్ మహమ్మద్

మహారాణిపేట: రాష్ట్రపతి అవార్డు గ్రహీత, దివంగత సయ్యద్ మీర్ మహమ్మద్ జయంతి సందర్భంగా కేజీహెచ్ భావనగర్ వార్డులో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ వీటిని అందజేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ కుమారుడు, పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇలియాస్ మహమ్మద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఏవీఎన్ కాలేజీ కుష్టువ్యాధి నివారణ కేంద్రంలో రోగులకు, పాపా హోమ్‌లో అనాథలకు భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇలియాస్ మహమ్మద్, ట్రస్టు సభ్యులు సి.ఎం.రమణ, మైలపల్లి శ్రీను, ఎం.డి.మన్నన్, ఎ.అతుల్లా, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

వార్డులు పరిశుభ్రంగా ఉంచాలి



బుక్కా వీధిలో పరిసరాలను పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: వార్డుల్లో చెత్త ఎప్పటికప్పుడు యార్డుకు తరలించాలని జీవీఎంసీజోన్-4 జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. బుధవారం 38 వార్డులోని బుక్కా వీధి, కంచరవీధి, గోశాల హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వార్డుల్లో వీధులు పరిశుభ్రంగా లేవని అసహనం వ్యక్తం చేశారు. ఇళ్ల మధ్య కాల్వలు అపరిశుభ్రంగా ఉంటే దుర్వాసనతో పాటు దోమలు ఉత్పత్తి అయి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు సిబ్బందితో చెత్త ఎత్తించి యార్డుకు తరలించాలన్నారు. ప్రజలు కూడా క్లాప్ వాహనాలకు చెత్త అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ డీఈ నర్సింహారావు, ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఏఈ సంషుద్దీన్, సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి



స్వర్ణ వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి

దాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపాన 148 సంవత్సరాల చరిత్ర గల కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి 1075 జయంతి ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆస్థాన ప్రధాన పురోహితుడు ఆర్‌బీబీ కుమార శర్మ నేతృత్వంలో 102 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, వాసవీ మూల మంత్ర హోమం జరిపారు. కార్యక్రమంలో కంకటాల మల్లిక్, పైడా కృష్ణప్రసాద్, డాక్టర్ ఉప్పల భాస్కరరావు, ఆలయ సంఘ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు జగదాంబ జంక్షన్ మహారాణిపేట అంబికాబాగ్ రామాలయం నుంచి శోభాయాత్ర సాగింది. యాత్ర పొడవునా తప్పెటగుళ్లు, కోలాటం, కేరళ వాయిద్యాలు, భగవన్నామ సంకీర్తనతో పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. పెనుగొండ కామరాజు, దోమ వెంకట బాలాజీకుమార్, పెనుగొండ చంద్రశేఖర్, దుర్గా సోమేశ్వరరావు, విన్నకోట రామమూర్తి, పూసర్ల సురేష్‌కుమార్, సుగ్గ శివ, బొడ్డు రఘు, నల్లూరి నూకరాజు, కంకటాల సతీష్, కడిమిశెట్టి వెంకటరమణ, పాలూరి వరప్రసాద్, అరుణ్‌కుమార్, గ్రంథి దుర్గాప్రసాద్, కల్లూరి సత్తిబాబు, జీవీఆర్ కుమార్, సంజీవరావు, సీవీఎన్ రామకృష్ణ, నూకేశ్వరరావు, పాల్గొన్నారు.


కేఘీ హెచ్!







కేజీహెచ్ కాలువల దుస్థితి



ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని.. కింగ్ జార్జి ఆస్పత్రి (కేజీహెచ్). ఏటా లక్షల మందికి ఆరోగ్య భద్రతనిచ్చే ఆస్పత్రిలో అపారిశుధ్యం తాండవిస్తోంది. ఏ వార్డు ఆవరణ చూసినా.. పూడుకుపోయిన కాలువలు, చెత్తాచెదారం, తాగిపడేసిన మద్యం బాటిళ్లు దర్శనమిస్తాయి. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయాల్సిన కాంట్రాక్టర్ కక్కుర్తి కేజీహెచ్‌లో ఈ దుస్థితికి కారణమని సమాచారం. చాలినంత మంది సిబ్బందిని విధుల్లో పెట్టకుండా.. తక్కువ మందితో కానిచ్చేసి, దండిగా కాసులు వెనకేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

- ఆస్పత్రి ఆవరణంతా అపరిశుభ్రతే
- కంపు కొడుతున్న మరుగుదొడ్లు
- 275 మందికి 102 మంది మాత్రమే విధుల్లో..
- ఎక్కడ పడితే అక్కడ మద్యం ఖాళీ బాటిళ్లు
- మందుబాబులకు నెలవుగా ఆస్పత్రి ఆవరణ

మహారాణిపేట: కేజీహెచ్‌లో అపరిశుభ్రత, తాగుబోతుల బెడద పెరుగుతోంది. వార్డుల్లో పర్యవేక్షణ లోపించడంతో రోగులు, వారి సహాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. పలు వార్డుల్లో మరుగుదొడ్లకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. దీంతో ఆస్పత్రి ఆవరణలో ఎక్కడ పడితే అక్కడ బహిరంగ మలవిసర్జన జరుగుతోంది. రాత్రయితే చాలు.. మందుబాబులు విచ్చలవిడిగా వ్యవహరిస్తూ, తాగేసిన మద్యం బాటిళ్లను అక్కడే పారేస్తున్నారు. ఇన్ని ఇబ్బందుల మధ్య రోగుల కోసం వచ్చే వారి సహాయకులు నానా పాట్లు పడుతున్నారు.

సిబ్బంది తక్కువ.. పని ఎక్కువ

రోగులతోపాటు, వారి వెంట వచ్చే సహాయకుల ఆరోగ్యాలను కాపాడాల్సింది కేజీహెచ్ అధికార యంత్రాంగమే. అలాంటిది అపరిశుభ్ర వాతావరణంలో కేజీహెచ్ కొట్టుమిట్టాడుతుంటే తమ ఆరోగ్యాలకు భరోసా ఏంటని రోగులు, వారి బంధువులు వాపోతున్నారు. ఇక్కడ దైనందిన పారిశుధ్య పనులు చేపట్టేందుకు 275 మంది కార్మికులు ఉండాలి. కానీ 102 మంది మాత్రమే ఉన్నారు. వారిని కూడా పూర్తి స్థాయిలో పనుల్లోకి వినియోగించే పరిస్థితి లేదు. ప్రతి రోజూ విధుల్లోకి వచ్చేందుకు వారు సిద్ధంగా ఉన్నప్పటికీ.. నెలలో 10–15 రోజులు మాత్రమే కాంట్రాక్టర్ పని ఇస్తాడు. ఆ పని దినాలకు కూడా సక్రమంగా జీతాలు చెల్లించడని ఆరోపణలున్నాయి. 8 గంటల విధుల్ని కాస్తా 12 గంటలకు పెంచి, పని చేయాల్సిందేనని ఒత్తిడి తీసుకొస్తున్నట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. అవమానకర రీతిలో మాట్లాడుతూ తమను ఇబ్బంది పెడుతున్నట్లు చెప్తున్నారు. ఇంత జరుగుతున్నా సదరు కాంట్రాక్టర్‌పై కేజీహెచ్ యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడం వెనుక సందేహాలు ముసురుకుంటున్నాయి.

> **చొరవ తీసుకోవాలి**
>
> ఆస్పత్రి ఆవరణలో ఇంతటి దారుణ పరిస్థితులు సరికాదు. ఈ వాతావరణం వల్ల రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వార్డుల్లో పరిస్థితి కూడా దారుణంగా ఉంది. తక్షణం వార్డుల్లో మరుగుదొడ్లను శుభ్రం చేయించాలి. తాగునీటి సౌకర్యం, కేజీహెచ్‌లో ఆరోగ్యకర వాతావరణం కల్పించాలి.
>
> –కె.చంద్రశేఖర్, డీవైఎఫ్ఐ నాయకుడు

మందుబాబుల ఆగడాలు

కేజీహెచ్‌లో మందుబాబుల ఆగడాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది, వారి బంధువులతో స్నేహంగా ఉంటూ.. చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారు. రోగులు, వారి బంధువుల నుంచి పర్సులు, సెల్‌ఫోన్లు, ఆభరణాలతో పాటు, ఆస్పత్రి ఆస్తులకు కూడా కన్నం వేస్తున్నారు. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల టైర్లు, ఆయిల్, ఇతర పరికరాలను దొంగిలిస్తున్నారు. గతంలో బైక్‌లను చోరీ చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. గతంలో రాత్రి సమయంలో కొంత మంది దొంగలు ఆక్సిజన్ ట్యాంక్ నుంచి సరఫరా అవుతున్న వైర్లను కట్ చేసేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఇంత జరుగుతున్నా.. పోలీసులుగానీ, కేజీహెచ్ అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాల్లేవు.

హామీలు అమలు చేయాలని ఆటోడ్రైవర్ల ఆందోళన



సరస్వతీ పార్కు వద్ద సమ్మె చేస్తున్న ఆటో డ్రైవర్లు

జగదాంబ: ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. బుధవారం సరస్వతీ పార్కు వద్ద ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డ్రైవర్లకు వాహనమిత్ర ద్వారా రూ. 15 ఇవ్వాలన్నారు. 21, 31 జీవో రద్దు చేయాలన్నారు. పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువులు, విద్యుత్ చార్జీలు తగ్గించాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 20న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, శ్రీనివాస్, జోగారావు, పెద్దమూర్తి, నూకప్పారావు, సూరిబాబు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు హెడ్ నర్సులకు పదోన్నతి



ఉత్తర్వులు అందజేస్తున్న డాక్టర్ రాధారాణి

మహారాణిపేట: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టుల కోసం బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. హెడ్ నర్సులుగా పని చేస్తున్న ముగ్గురికి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లుగా పదోన్నతులు లభించాయి. డి.కవిత (రీజినల్ కంటి ఆస్పత్రి), జి.చంద్రిక (పాడేరు ప్రభుత్వ ఆస్పత్రి), ఎం.ఇందిర (పాడేరు ప్రభుత్వ ఆస్పత్రి) లకు పోస్టింగులు ఇస్తూ వైద్యారోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు భవానీ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



వాసవీమాతకు పూజలు చేస్తున్న సంఘం ప్రతినిధులు

దాబాగార్డెన్స్: దొండపర్తిలో గల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ సమావేశ మందిరంలో బుధవారం అక్కయ్యపాలెం నందగిరినగర్ శ్రీవాసవాంబిక ఆర్య వైశ్య సంఘం కమిటీ ప్రతినిధులు వాసవీమాత కన్యకాపరమేశ్వరి జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ జరిపారు. అనంతరం 108 మంది మహిళలచే సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ సర్వ మంగళ ప్రదాయినిగా, ఆర్యవైశ్యుల ఇలవేల్పుగా అవతరించిన కన్యకాపరమేశ్వరిని ఎవరైతే భక్తి శ్రద్ధలతో కొలుస్తారో వారికి అమ్మవారి పరిపూర్ణ కటాక్షం లభించడమే కాక సిరి సంపదలు కలుగుతాయన్నారు. అనంతరం అమ్మవారి అవతార విశిష్టత తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌ను కమిటీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లూరు రూప, ఉత్సవ కమిటీ చైర్మన్ జి. కృష్ణ, అధ్యక్షుడు ఎం. సుబ్రహ్మణ్యం, కార్యదర్శి నాగేశ్వరరావు, కోశాధికారి నాగేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు గణేష్, ఎస్. జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న తిరు కల్యాణోత్సవానికి అంకురార్పణ



బల్లిగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి కల్యాణానికి పసుపు దంచుతున్న భక్తులు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవానికి బుధవారం అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనసేవ, నూతన వస్త్రాలంకరణ, స్వామివారిని, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించారు. సాయంత్రం దేవస్థానం మండపంలో ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు, వేదపండితులు ఉత్సవ సంకల్పం చేపట్టారు. ఈ సందర్భంగా విశ్వక్షేణపూజ, పుణ్యాహవచనము, స్థల శుద్ధి మృత్యం గ్రహణం, అంకురార్పణ, వాస్తు మండపారాధన పూజ, అధివాసములు, అగ్నిప్రతిష్ట, విశేష హోమాలు, నివేదన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జీవీ రమాబాయి, సిబ్బంది రవి, సేవకులు రాంబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు తిరుకల్యాణోత్సవం..

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా గురువారం సాయంత్రం 7 గంటల నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆమె కోరారు.

జెడ్సీలు విధిగా జోన్లలో పర్యటించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

దాబాగార్డెన్స్: జోనల్ కమిషనర్లు విధిగా జోన్లలో పర్యటించాలని, ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించి వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం అన్ని జోన్ల కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జెడ్సీలు ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు.

జీవీఎంసీ స్థలాలు ఆక్రమణకు గురి కారాదు..

జీవీఎంసీ ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. సర్వేయర్లు, ప్లానింగ్ కార్యదర్శులు కలిసి ఖాళీ స్థలాలను గుర్తించి 15 రోజుల్లో హద్దు, రాళ్లు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. తన ఛాంబర్లో ఆయా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చీఫ్ సిటీప్లానర్ ప్రభాకరరావు, సిటీ ప్లానర్ మీనాకుమారి, డిప్యూటీ సిటీ ప్లానర్లు హరిదాసు, రామ్మోహనరావు, ఏసీపీలు, టీపీవోలు, టీపీఎస్‌లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా సేవలు విస్తృతం కావాలి



మినీ బాలోత్సవం కార్యక్రమ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సొసైటీ సభ్యులు

దాబాగార్డెన్స్: ఆసరా చారిటబుల్ ట్రస్ట్ సొసైటీ సేవలు మరింత విస్తృతం చేయాలని సొసైటీ అధ్యక్షురాలు సునీత పిలుపునిచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆసరా 11వ వార్షికోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, ఆసరా ఆధ్వర్యంలో నడుస్తున్న 21 ట్యూషన్ కేంద్రాల సిబ్బందిని బహుమతులతో సత్కరించారు. ఇటీవల జరిగిన మినీ బాలోత్సవం పుస్తకం విడుదల చేశారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై పలు సూచనలు చేశారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైజాగ్ క్లబ్ వ్యవస్థాపకురాలు కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందివ్వడంలో వీసీసీ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఆసరా సభ్యులు శ్యామల, శోభ, సంజీవ్‌కుమార్, శ్రీనాథ్, శ్రీనివాసరావు, వైజాగ్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో మానసిక ప్రశాంతత

ఉచిత యోగా వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



యోగాలో శిక్షణ ఇస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మి

మహారాణిపేట: నిత్యం యోగ సాధన వల్ల మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ, రక్త వృద్ధి చెంది అనేక రుగ్మతలు తగ్గుతాయని ప్రకృతి చికిత్సాలయం అధినేత డాక్టర్ శిష్టా లక్ష్మీనారాయణ అన్నారు. మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో బుధవారం ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ ఉచిత శిబిరం నెల రోజుల పాటు నిర్వహిస్తామని, ఔత్సాహికులంతా పాల్గొనాలని పిలుపు నిచ్చారు. యోగ సాధకురాలు డాక్టర్ ఎస్. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7 వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు వయోభేదం లేకుండా స్త్రీ, పురుషులు, విద్యార్థులకు చితంగా యోగాలో శిక్షణ ఇస్తున్నామన్నారు. మిగతా వివరాలకు నేచర్ క్యూర్ హాస్పిటల్ (ప్రకృతి చికిత్సాలయం) గోకుల్ పార్క్ ఎదురు రోడ్డు, బుద్ధవరపు గార్డెన్స్, మహారాణి పేట, విశాఖపట్నం–2లో గానీ 9866077307 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్ రూపాకుల రవికుమార్, హిమ బిందు, సాధన, క్షీరాబ్ధిదుతి, పూజిత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు

దాబాగార్డెన్స్: అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన మే 20 దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా చేసి యాజమాన్యాలకు లాభం చేకూర్చే విధంగా రూపొందించిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలన్నారు. చట్టాల్లో మార్పులు చేయాలంటే పార్లమెంట్‌లోనే చేయాలి. కానీ లేబర్ కోడ్‌ల ద్వారా రాష్ట్రాలకు ఇష్టం వచ్చినట్టు మార్చే అధికారాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కే ఎస్‌వీ కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మన్మథరావు, సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు కనకారావు, ఏపీ ఎఫ్‌టీయూ నాయకుడు దేవా, ఏసీటీయూ నాయకుడు కె. శంకర్రావు, వైఎస్సార్‌టీయూసీ నాయకుడు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధానికి సై..

- ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వెటరన్ ఫ్లైట్ లెఫ్టినెంట్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



ఆపరేషన్ సిందూర్ విజయంపై కార్యాలయం వద్ద బాణసంచా కాల్చుతున్న వాసుపల్లి, పార్టీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: ఇండో–పాక్ యుద్ధానికి తాను సై.. అంటూ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వెటరన్ ఫ్లైట్ లెఫ్టినెంట్, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయంపై ఆశీల్‌మెట్ట సమీపాన తన కార్యాలయం వద్ద త్రివర్ణ పతాకం చేతపట్టి, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యాలయం ముందు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. పాకిస్తాన్ ఇంకెప్పుడూ భారత్ వైపు తిరిగి చూడకూడదంటే తక్షణం యుద్ధం ప్రకటించాలన్నారు. పాకిస్తాన్‌ను నామరూపాల్లేకుండా చేయగలిగే సత్తా భారత్‌కు ఉందన్నారు. కనీసం ఇంధనం కూడా సరిపడా లేని పాకిస్తాన్, భారత్‌ను ఎదుర్కోలేకే దొంగ దెబ్బ తీయాలని చూస్తోందన్నారు. యుద్ధమే వస్తే ఒక్క టర్కీ తప్ప, మిగిలిన అన్ని దేశాలు భారత్‌కే సహకారమందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట పద్మావతి, చెన్నా జానకిరామ్, బిపిన్‌కుమార్ జైన్, పలు వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాక్ డ్రిల్‌తో ప్రజల అప్రమత్తం



భవంతి వద్ద బాంబు పేలి అలుముకున్న పొగ



ప్రమాదంలో చిక్కుకున్న మహిళను బయటికి తీసుకొస్తున్న సిబ్బంది

దాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపాన రాణిబొమ్మ వద్ద.. ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలలో వేర్వేరుగా బుధవారం సాయంత్రం మాక్‌డ్రిల్ నిర్వహించింది. సివిల్ డిఫెన్స్, అగ్నిమాపక, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, పోలీస్, జీవీఎంసీ, రెవెన్యూ, సివిల్ సప్లైస్, వైద్య శాఖలు పాల్గొన్నాయి. పలువురు వలంటీర్లు భాగస్వాములయ్యారు. రాణిబొమ్మ సమీపాన రెండు భవనాల్లో ఉగ్రమూకలు పొగ బాంబులతో దాడి చేయగా స్పందించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు అదుపు చేశాయి. వెంటనే సంఘటనా స్థలికి చేరుకున్న ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సహాయక సిబ్బంది ప్రమాదంలో చిక్కుకున్న ప్రజలను కాపాడారు. గాయపడిన వారిని హుటాహుటిన తాత్కాలిక వైద్య శిబిరాలకు తరలించి ప్రథమ చికిత్స అందజేశారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వద్ద ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ప్రత్యేకంగా మాక్‌డ్రిల్ నిర్వహించాయి. ఉగ్రమూకల దాడుల నేపథ్యంలో తరగతి గదుల్లో చిక్కుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులను ఎలా రక్షించాలో, వారు ఎలా వ్యవహరించాలో ప్రదర్శన ఇస్తూ అప్రమత్తం చేశాయి. ఎస్‌డీఆర్‌ఎఫ్ ఐజీ రాజకుమారి, కలెక్టర్ ఎంఎన్ హరేందిరప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.13.50 లక్షలు

అల్లిపురం: ఆశీలమెట్ట దరి సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ ఆదాయం రూ.13,50,693 సమకూరినట్లు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఈ మొత్తం 20 రోజులకుగాను లభించిందని పేర్కొన్నారు. అదే విధంగా 192 గ్రాముల 700 మిల్లీగ్రాముల వెండి, 19 యూఎస్ డాలర్లు, శ్రీలంక కరెన్సీ రూ.300 లభించాయన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ టీఆర్ చోళన్, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవదాయ శాఖ తనిఖీ అధికారి కె.గాయత్రి, దేవాలయ సిబ్బంది జి.గోవింద్‌రెడ్డి, డీఎస్ ప్రసాద్, బ్యాంకు ఆఫ్ ఇండియా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.